

ఇస్తేది కానీ లేకపోయినా అల్లుడికినా నికి మాత్రం లోటురాకూడదు ఛీ! జన్మ ఎత్తగానే సరి! చిన్నప్పట్నుంచీ పెంచి పెద్దచేసి, కట్నంతో సహా, కన్న కూతుర్ని చేతిలో పెట్టబట్టేగా? ఇంత లోకువ?

ఉత్తరం సాంతంగా చదువుకుని, ముక్కలు, ముక్కలుగా చించి నేలమీద పారేసి కాళ్లతో రాసేశాడు పద్మనాభంగారు. ప్రక్కగదిలో, గుమ్మందగ్గరగా నిలబడి తండ్రిచేష్టలు కనిపెడుతూ నేవుంది పద్మ. ఆ ఉత్తరం, తన భర్త రాసిందేననీ, ఆ ఉత్తరం సాంతంగా చదివి, తండ్రి పై మాటలు గట్టిగా అని, చించివేయడంవల్ల, భర్తధోరణి ఇంకా మారలేదనీ, గ్రహించింది పద్మ. ఏమని వ్రాశారో? ఏమనీ వ్రాయకపోతే నాన్న కెందుకంత చిరాకు వస్తుంది? అల్లుడైతే మాత్రం? అంత నిర్లక్ష్యమా? అంత చదువూ, చదివి ఆ మాత్రం ప్రపంచజ్ఞానం, సంస్కారం లేకపోతే ఎలా? ఇప్పటికే తన పెళ్లిమూలంగా, నాన్న సగం కృంగిపోయారు! ఇంకా హిరణ్యాక్షువరాలేనా? తండ్రిగదిలోకి వెళ్లడానికే భయపడింది పద్మ. ఏం రాశారు, నాన్నా? అని అడుగుదామని అనుకుని సాహసించలేకపోయింది. ఏదో విధంగా ఆయనమనస్సు నొప్పించేలాగే, రాసివుంటారు? అటువంటప్పుడు ఏమని అడగటానికి మొఖం చెల్లలేదు - పద్మకి ఒక్కసారి హృదయంలో శోధ చెలరేగింది. అప్రయత్నంగా ఆమెకళ్లు నీళ్లతో నిండిపోయాయి. ఇంతలోనే ప్రక్కగదిలోంచి, "అమ్మాయ్? పద్మా?" అని తండ్రి వేసిన కేక, ఆమెకు వినపడింది వస్తున్నా! నాన్నా! అంటూ ఒక్క గంతేసింది గదిలోకి. తండ్రి రెండుచేతులతోనూ, తల పట్టుకొని వాలుకుర్చీలో పడుకుని ఆలోచిస్తున్నాడు. తండ్రిముఖంలోని విశ్వేదం, ఆ వేదనా, పద్మ గ్రహించకపోలేదు—

"ఏం నాన్నా పిల్చారు?" అంటూ, జంకుతూ, జంకుతూ నిలబడింది పద్మ.

"దొరగారు, పండుక్కి రారటమ్మా. పెళ్లిలో చేసిన వాగ్దానం ప్రకారం లేడిమోకొని స్తేగాని పండుక్కి రానని ఖచ్చితంగా రాశాడు. రాకపోతే పోనియ్యి వచ్చేం ఉద్ధరించాలి! ఇలాంటి అప్రయోజకుడికీ, దురహంకారికీ, విశాలదృష్టిలేని అల్లుడికీ, నా కూతుర్నిచ్చి పెళ్లిచెయ్యడం నాదే తప్పు. లాకపోతే మన కేం నలుగురితోనూ చిన్నతనం లేదూ? పెళ్లి కాఫీనీళ్లు పెట్టు

# దూరపు కొండలు



"పొలంలోకి పోవాలి" అన్నారు పద్మనాభంగారు—పద్మ క్షణం ఆలోచించింది. ఆమె ముఖం, అప్పటివరకూ, చిరునవ్వు వెన్నెలలు క్రుమ్మరించే ఆముఖం, కళారహితమై చిన్నబోయింది "సరే! పోనీ నాన్నా రాకపోతే ఏం చేస్తాం," అంటూ నిష్క్రమించింది పద్మ అక్కణ్ణుంచి. అంతకంటే ఆమె ఏం చేయగల్గుతుంది! కుమార్తె ముఖంలో వచ్చిన మార్పూ, ఆమె ఎంతో చిన్నబుచ్చుకోవడం తండ్రి గమనించక పోలేదు—గమనించి ఏం చేయగలడు! ఆయన రెండుచేతులతోనూ తలపట్టుకుని మథనపడసాగేడు. అవును. ఆయన అలా బాధపడ్డానికి కారణం లేకపోలేదు.

పద్మనాభంగారిక్కి ముగ్గురు ఆడపిల్లలూ, ఇద్దరు మొగపిల్లలూ, మొత్తం సంతానం అయిదుగురు. ఆయనకి తన స్వగ్రామంలో, ఓ పదెకరాల పల్లమూ, ఓ స్వంత పెంకుటిల్లూ, అదే ఆయన ఆస్తి. ఆయన కొంతకాలం చిన్నతనంలో గవర్నమెంటు కంపౌండరుగా పనిచేయడంవల్ల వైద్యం కొంత తెలుసు. తన అనుభవంవల్ల వైద్యములో బాగా ఆరితేరినవాడవడంవల్ల ఆ పల్లెటూళ్లో ఆ వృత్తివల్లకూడా, పదీ పరకా, దొరుకుతూఉంటాయి. పద్మనాభంగారి భార్య మంచి వయస్సులోనే, పిల్లల భారం అంతా తండ్రికి అప్పగించి, పసుపు కుంకుమలతోనే పరలోకానికి వెళ్ళింది. ఆవిడ ఎంత మంచి ఇల్లాలూ, సద్గుణవతీ, మరెవరూ లేరని, ఆ గ్రామంలో ఆమె బ్రతికుండగానే, మంచి యశస్సు ఆర్జించుకొంది. ఆమె బ్రతికున్నరోజుల్లో పద్మనాభంగారి పని చాలావరకు బాగుండేది. ఎప్పుడూ కలకల్లాడుతూ, లక్ష్మీదేవిలా, ఇంటికి ఎంతో వెలుగు నిస్తూ, భర్త ఆదర్శాలకు అనుగుణ్యంగా నడుచుకుంటూ, పిల్లల దగ్గర తన మాతృత్వాన్ని సార్థకం చేసుకుంటూ 'గృహలక్ష్మి' అన్న పేరు ఈమెకే తగును, అన్నట్లుగా ఆమె బ్రతికిందని వినికిడి. ఆవిడ బ్రతికున్నరోజుల్లో పద్మనాభంగారికి అన్నివిధాలా కలిసివచ్చేది అనీ, ఆమె పోయినాకనే ఆయనకి చెడురోజులు పట్టుకున్నాయని ఊరివాళ్లు అనుకుంటూ ఉండటం కద్దు—భార్యపోయిన అనంతరమే తన ప్రాక్టీసూ, ఉద్యోగమూ, మానుకొని బస్తీనుండి తన స్వగ్రామం చేరుకున్నాడు పద్మనాభంగారు.

పిల్లలతో స్వగ్రామం చేరుకున్న అనంతరం ఉన్న పదెకరాలభూమీ వ్యవసాయం చేసుకుంటూ జీవితశేషం ప్రశాంతంగా, పరమార్థచింతతో గడుపుదామనుకొన్న పద్మనాభంగారు పిల్లల సమస్యతో ఊపిరి సలపకుండా, తీరని మనోవ్యసనానికి గురి కావలసివచ్చింది—పద్మనాభంగారి పెద్దకూతురు పద్మకి తల్లిపోయేసరికి పన్నెండేళ్లు. తల్లిపోయిన పన్నెండేండ్లవరకూ పద్మకి కల్యాణయోగం పట్టనేలేదు. ఈడొచ్చిన పిల్లని ఇంకా ఎంతకాలం ఇంట్లో పెట్టుకుని కూర్చుంటా రమ్మా అంటూ, ఆశేమ్మా, బోశేమ్మా, నోళ్లు నొక్కుకుంటూవుంటే పద్మనాభంగారి హృదయం చివుక్కుమనేది. ఎలాగైనా మంచి సంబంధం చూసి కూతురుపెళ్ళి చేసెయ్యాలని ఎంతో శ్రమపడ్డాడు. కూతురికి సంబంధం వెదకడంలో పన్నెండేళ్ళ పిల్లకి పాతికేళ్లు వచ్చాయి. ఎన్ని సంబంధాలు వచ్చినా, ఆస్తి వుంటే చదువు ఉండకా, చదువూ ఆస్తీవుంటే, అందం వుండకా, ఈ మూడూ వుంటే, వయస్సు ముదిరిన ఏ రెండోపెళ్ళివాడో, అవుతూవచ్చేది. అందులోనూ పొట్టచింపితే అక్షరంముక్క లేకపోయినా, నెత్తిమీద వుంజెడు వెంట్రుకలు లేకపోయినా సరే, అథమం పెళ్ళిఅవవలసిన మొగాడుగా లోకంచేత పరిగణింపబడితే చాలు. అథమ్పయిన్వెన్నూటపదహార్లయినా కనీసం ఇంచుకుంటేనేగాని, అల్లుడనేవాడు దొరకడం లేదు. అయిదు సంవత్సరాలకాలం కాళ్లు అరిగిపోయేటట్లుగా తిరిగాడు పద్మనాభంగారు అల్లుడుకోసం. కూతురికి, ఎంత ఆలస్యం అయినాసరే అన్నివిధాలా, మంచి సంబంధం చెయ్యాలని ఆయన సంకల్పం.

చచ్చిపోతూ, చచ్చిపోతూ, తన చేతిలో చెయ్యివేయించుకుని మరీ చచ్చిపోయింది తనభార్య. పెళ్లివిషయంలో మాత్రం బాగా ఆలోచించి, మంచి సంబంధం చూసి కూతుళ్లకు పెళ్లి చెయ్యమనీ, తన కూతుళ్లు అనుకూలురైన భర్తలతో, అన్నవస్త్రాలకు లోటులేకుండా ఆదర్శ గృహజీవనం చెయ్యడమే తన కోరిక అనీ, అప్పుడే స్వర్గంలోని తన ఆత్మ శాంతిస్తుందనీ, మరణశయ్యమీద భార్య చెప్పి మరీ చచ్చిపోయింది. ఆకారణంగా ఎలాగైనా సరే "మంచిసంబంధం, ఎంతకష్టపడి వెతికి అయినా సరే పద్మకు చెయ్యాలని" ప్రయత్నించాడు పద్మనాభంగారు.

పద్మనాభంగారికి, అప్పకొడుకు అయిన

సుబ్బారావు ఇంట్లోనే ఉన్నాడు. రూపవంతుడూ, గుణవంతుడూ కూడా. అయితేనేం, మరి పెద్దచెప్పుకోవలసిన ఆస్తి ఏమీ లేదు తన ఉద్యోగంతప్ప. సుబ్బారావుకి ఎకౌంట్సుడిపార్టుమెంటులో, నూరురూపాయల జీతం. తండ్రి సంపాదన ఏమీ లేనందువల్ల, తనవెనకాల ఇంకా అరడజనుమంది పిల్లలతో, బాధపడే, తండ్రికి ప్రతినెలా, ముప్పై, నలభై, సాయంచేస్తూ వచ్చిన జీతంతోనే క్లుప్తంగా గడుపుకుంటూ దురభ్యాసాలు ఏవీ లేక, యువకులకు ఆదర్శంగా బ్రతికే, తనచేతిలోని మేనల్లుడు అప్పట్లో తనకంటికి ఆనలేదు... కారణం అతను పెద్ద ఆస్తిపరుడు కాడు.

దగ్గర ఊళ్లోనే దగ్గరవాడే అయిన కరణం శాస్త్రికూడా అప్పట్లో ఆయన కంటికి ఆనలేదు. కరణంశాస్త్రికి పాతికేళ్లుంటాయి. మంచి రూపవంతుడు. స్ఫురద్రూపి. యాభై యకరాల స్వంతమాగాణీభూమి, స్వంత ఇల్లూ ఉన్నాయి. చాలామంచివాడు. కావలసినంత పాడి,పంట—దేనికీ లోటు లేదు. పద్మని చేసికోటానికి మొదట అతని తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. కాని అప్పట్లో అతనూ పద్మనాభం గారి దృష్టిలో ఆనలేదు. కారణం? అయిదవఫారంతోనే అతను చదువుకి స్వస్తిచెప్పి, స్వంతవ్యవసాయంలోకి దిగాడు. అతనికి ఏ యూనివర్సిటీ డిగ్రీలూ లేవు.

సమీపపట్నంలోనే పెద్ద ఉద్యోగం చేసే జ్ఞాతి మరొకడున్నాడు. ఆ సంబంధం కూడా వచ్చింది. శర్మ ఆ సంవత్సరమే బికామ్‌హానర్స్ ప్యాసై, సరాసరి ACTO ఉద్యోగానికి ఎన్నుకోబడ్డాడు. వయస్సు 25. దృఢకాయుడు. పైగా, స్వగ్రామంలో, స్వంతఇలూ, యాభై ఎకరాల సుక్షేత్రం లాంటి పొలమూ ఉంది. శర్మతల్లి దండ్రులు కూడా పద్మని చేసికోటానికి అప్పట్లో యిష్టపడ్డారు. కాని పద్మసాభంగార్కి ఆ సంబంధమూ నచ్చలేదు. కారణం! శర్మ చాలా నలుపు. పైగా చిన్నప్పుడు మశూచి రావడంవల్ల అతని ముఖం నిండా, స్మాల్ ఫాక్స్‌మచ్చలు! ఇంతకీ అతడు రూపవంతుడు కాడు. అంచాత ఆ సంబంధం కూడా పద్మనాభంగార్కి నచ్చలేదు.

ఇంకోమంచి సంబంధం కూడా వచ్చింది అప్పుడు. దగ్గరవాడే, ఓవర్ సీర్ ఉన్నాడు. ఓవసీర్ మూర్తి చాలా అందగాడు. అప్రెంటీసు అయిపోయి అప్పుడే అసిస్టెంటుఇంజనీరు అయాడు. మంచి ఉద్యోగం. మంచి రాబడి. పైగా పెద్ద స్థిరాస్తి. విద్యా, రూపమూ, ధనమూమూడూ కూడా ఉన్నాయి. అతడుకూడా పద్మను చేసుకుంటా నన్నాడు. కాని అదీ పొసగలేదు. ఆ సంబంధం కూడా పద్మనాభం గారికి నచ్చలేదు. కారణం? అతనికి మొదటి భార్య పోయి సంవత్సరం అయింది అయిదేళ్ళ ఆడపిల్ల ఉంది— అతను రెండో పెళ్లివాడు. తన కూతుర్ని రెండో పెళ్లివాడి కివ్వడమా? అదీ నచ్చిందికాదు పద్మనాభంగార్కి.

ఎలాగైతేనేం మంచి సంబంధంకోసం అయిదేళ్లు తిరిగాడు పద్మనాభంగారు. పద్మనాభంగారి తమ్ముడు మిలిటరీ ఎకౌంట్సు డిపార్టుమెంటులో సూపర్‌వైజర్‌గా పని చేస్తూఉండేవాడు. ఆయన ఆఫీసులో సబ్‌డివిజనల్ ఆఫీసర్ రావుగారనే ఆయన ఒక డుండేవాడు. ఆయనకీ, పద్మనాభంగారి తమ్ముడు మూర్తిగారికీ, చాలా స్నేహం. మాటలసందర్భంలో, మూర్తిగారు, పెళ్లవవలసిన తన అన్నగారి అమ్మాయి ఉందనీ, ఆ అమ్మాయి పెళ్లికోసం, తన అన్నగారు, చాలా శ్రమపడుతున్నారనీ, చెప్పారు. రావుగారు క్షణం ఆలోచించి, పెళ్లికావలసిన తన తమ్ముడు ఉన్నాడనీ బి. యే. చదువుతూ మానేసి, మిలిటరీ సర్వీసులో చేరాడనీ ఇంకొక సంవత్సరంలో, సర్వీసు నుంచి రిలీజు అయివచ్చేస్తాడనీ, నాలుగైదు రోజులలో శలవుమీద వస్తాడనీ చెప్పారు. ఇద్దరిశాఖా వకటే గనుక ఫరవాలేదు.

పద్మనాభంగారికి యీ వివరాలతో మూర్తి వ్రాసిన ఉత్తరం చేరగానే నిలబడ్డపళంగా వచ్చి, వరుణ్ణి చూసుకున్నారు. వరుడు మురళీకృష్ణ. చాలా అందంగా ఉంటాడు. చదువుకున్నాడని చెప్పారు. వాళ్ల స్వగ్రామంలో కొంత భూమి, స్వంత ఇల్లూకూడా ఉందన్నారు. ప్రస్తుతం మిలిటరీసర్వీసు అయిపోగానే గవర్నమెంటే పిలిచి మంచి ఉద్యోగం ఇస్తుందన్నారు—

పద్మనాభంగార్కి ఆ సంబంధమే అన్ని విధాలా నచ్చింది— సరే! పిల్లని చూసుకుని నచ్చిందంటే, కట్నంవగైరా విషయాలనుగురించి తరువాత మాట్లాడుకోవచ్చు నన్నారు. పెళ్లికొడుకు వచ్చి పిల్లని చూసుకుని నచ్చిందన్నాడు. కట్నం అధమం పదిహేను వందలయినా యిచ్చి లాంఛనాలూ, అవీ, ఇంకో అయిదువందలేనా ముట్టచెప్పాలన్నారు. అయితే అయింది. ఏ అప్పో, సప్పో, చేసి, వాళ్లు అడిగిన కట్నం ఇచ్చిఅయినా ఆ సంబంధం చెయ్యాలనే పద్మనాభంగారు తీర్మానించారు.

ముహూర్తంకూడా పెట్టేశారు వెన్వెంటనే. ఉన్నపదెకరాల కొంద్రమీదా మూడువేలు తనఖాపత్రం వ్రాశి అప్పు తెచ్చాడు పద్మనాంభగారు. అన్ని పనులూ సిద్ధంచేసుకున్నారు. ముహూర్తం సమీపించింది. యావన్మంది బంధువులూ కట్టగట్టుకుని వచ్చారు– కాని ఆ ముహూర్తానికి పెళ్లి అవలేదు. పెళ్లికొడుక్కి శలవు యివ్వలేదనీ, యింకా ఆరునెల్లకిగాని రాలేడనీ, టెలిగ్రాం వచ్చింది. వచ్చిన బంధువులంతా, రెండురోజుల పాటు మస్తుగా తిని, తమ దారిని పోయారు. చేసుకున్న ఖర్చంతా వృధా. అనవసరంగా ఆ సుముహూర్తం తప్పిపోవటంవల్ల, వెయ్యిరూపాయలు మట్టిలో పోసినట్లు అయిపోయాయి. అనంతరం ఆరునెల్లు గడిచాయి... రెండో ముహూర్తానికి ఎన్నో రాద్ధాంత సిద్ధాంతాల మీద, పద్మకి మూడుముళ్లూ పడ్డాయి–మొత్తంమీద కూతురికిమూడుముళ్లూపడ్డాయి అనిపించుకు నేసరికి మూడు వేలు అప్పు అయింది. అయితేఅయింది. మంచి సంబంధం దొరికింది. సుఖపడుతుంది కూతురు. అనుకున్నాడే గాని కథంతా యిలా అడ్డం తిరుగుతుందనీ, తను పూర్తిగా మోసపోయాననీ అనుకోలేదు పద్మనాభంగారు. పెళ్లయి మూడు సంవత్సరాలయింది. ఇంతవరకూ అల్లుడికి ఉద్యోగమే దొరకలేదు. అధమం మూడునెల్ల కోసారి వచ్చి, పదిహేనేసి రోజులు అత్తారింటిదగ్గరే మకాం చేయసాగాడు–వాచీకొనుక్కుంటాననీ, ఏదో సెక్రటరీకోర్సు చదవాలనీ, రెండొందలూ, మూడొందలూ, మారాంచేసి, మామగారి దగ్గర లాగడం సాగించాడు. ఒకమూల వడ్డీ పెరిగిపోయి అప్పు ముంచుకొచ్చేలా వుంది. ఒకదానివెంబడి మరొకటిగా ఎన్నో హిరణ్యాతువరాలు అల్లుడికి. ఇంతవరకూ ఏ ఉద్యోగమూ లేదు—అదిగో రైల్వేలో ఉద్యోగం వస్తుందనీ, ఇదిగో! సెక్రటరీ కోర్సు చదువు అయిపోగానే ఎకౌంటెంట్ జనరల్ ఆఫీసులో సెక్రటరీఉద్యోగం వస్తుందనీ చెప్పుకుంటూ వస్తున్నాడు—పెళ్లయి అయిదేళ్లయినా పెళ్లాన్ని కాపరానికి తీసికెళ్లలేదు – ఉద్యోగం ఏదయినా సంపాదించుకుని, నీ పెళ్లాం, నువ్వూ మీ బ్రతుకు మీరు బ్రతకండి. ఇంక మా యింట్లో నీకు అన్నంకూడా పెట్టం అని తల్లీ తండ్రీ ఖచ్చితంగా చెప్పి చిల్లిగవ్వయినా యివ్వకుండా కొడుకుని యింట్లోంచి గెంటేశారనీ, అన్నగారు పూనా బదిలీ అయిపోయి 'తమ్ముడిమాటే పట్టించుకోలేదనీ తెలిసింది కొన్నాళ్లకి. "అల్లుడు

ప్రస్తుతం యేం పని చేస్తున్నదీ తెలియదు. బి. ఏ. వరకూ చదివి మిలిటరీ సర్వీసు చేసి వచ్చినమనిషికి ఉద్యోగం దొరక్క పోతుందా" అనే అనుకున్నాడు గాని, తను బి. ఏ. చదివాడనుకొన్న అల్లుడు కనీసం స్కూలుఫైనలయినా ప్యాసు కాలేదనీ, స్కూలుఫైనలే మూడుసార్లు దండయాత్ర కొట్టించాడనీ, కొంతమంది విశ్వసనీయ వర్గాలద్వారా విన్నాడు పద్మనాభంగారు యీమధ్యనే.

అతణ్ణిగురించిన మంచి చెడ్డలూ, వివరాలూ, అతని అన్నగారూ తనతమ్ముడూ చెప్పగానే విన్నాడుగాని, స్వయంగా పద్మనాభంగారి కేమీ తెలియదు. అలా తెలిసికోడానికి దగ్గరచుట్టరికం లేదు. ఏదో రెండుజిల్లాల అవతలవాళ్లు. వాళ్లమంచి చెడ్డలు ఎవరైనా చెప్తే వినడమేగాని స్వయంగా తనేమీ చూడలేడుకదా? ఇంతకీ తను మోసపోయిన మాట యథార్థం. ఇంక వియ్యంకుడూ, వియ్యపురాలూ, వారాని కోసారి ప్రతిఉత్తరంలో ఫర్నిచర్ సామాను కావాలనీ, కొడుకు రేపు వేరేకాపురం ఉంటే, అన్నం వండుకోడానికి తప్పనిసరిగా దగ్గర్నుంచి అట్లకాడదాకా కొనిపెట్టాలనీ ఉత్తరాలు! ఏదో! ఎలాగైతే నేం? తనెంతో తెలివిగల వాణ్ణి అనుకుని, తను కళ్లతో చూచిన, ఎరిగున్న సంబధాలన్నీ వదిలేసి, తిరిగితిరిగి, ఏదో కొమ్ములున్నాయనుకొని తీసుకొచ్చిన అల్లుడికి కనీసం చెవులైనా లేకుండా పోవడం పద్మనాభంగారి హృదయానికి తీరని ఆవేదన ప్రాప్తించింది.

పెళ్లయి అయిదు సంవత్సరాలు కావస్తోంది. క్రొత్తపుగా అల్లుడిలో ఏమార్పూ లేకపోయినా ఇంకా కనీసం భార్యని కాపరానికి తీసికెళ్లడానికి అవకాశం లేకపోగా, అడుగడుక్కీ హిరణ్యాక్షువరాలు పద్మకు రహస్యంగా వ్రాసిన రెండు మూడుత్తరాలు పద్మనాభంగారి కళ్లపడకపోలేదు. మామగారికి గౌరవం తెలియదనీ, తన తాహతు ఆయన కనిపెట్టి తన్ని గౌరవించడంలేదనీ, డబ్బంటే పడి చస్తాడనీ, తను సెక్రటరీకోర్సు చదువుతున్నాననీ, డబ్బుకావాలనీ, ఏలాగైనా సరే తండ్రికి నచ్చచెప్పి రెండువందలు పుచ్చుకొని పంపించమనీ......

అసలే అమ్మాయి పెళ్లిచేసి మూడువేలు ఉన్నభూములమీద అప్పుచేశావు మళ్లీ పెళ్లికి సిద్ధంగా ఉన్న రెండోకూతురికి పెళ్లిచేయాలి? ఆ సంవత్సరం పొలం ఊడ్పన్నా అవలేదు-ఇంటరు చదువుతూన్న కొడుక్కి అధమం నెలకు నలభైరూపాయలన్నా పంపాలి. తరువాత ఇంటి ఖర్చు.

ఈ పరిస్థితుల్లో పండుగ వచ్చింది. ఏది ఎలాగున్నా అల్లుడయాకా, మామగారయాకా తప్పుతుందా? పండుక్కి వచ్చి మంచిచెడ్డలు మాట్లాడి పదిరోజులు ఉండి వెళ్ళమనీ, తన కష్టసుఖాలు, శాంతంగా చెప్పుకున్నట్లయితే పరిష్కారమార్గం ఆలోచిస్తాననీ రాశాడు పద్మనాభంగారు అల్లుడికి ఉత్తరం—వచ్చిన సమాధానం చూసుకుని ఆయనకు ఏడవాలో,నవ్వాలో తెలియలేదు - మీ గౌరవానికి చాలా సంతోషిస్తున్నాను. నేను పండుక్కి రావటానికి తీరుబడిలేదు. నాకు మీరు పెళ్ళిలో రేడియో కొనిస్తానన్నారు. ఇవ్వలేదు. ఈసంవత్సరమైనా కొనియిస్తారా లేదా? ఇస్తేనే మన ఇద్దరిమధ్యా యథాప్రకారం రాకపోకలు జరుగుతాయి లేకపోతే లేదు. మీ దారి మీది. నా దారి నాది. కాబట్టి వెంటనే యీ నా ఉత్తరానికి జవాబు వ్రాయండి.

నేనిక్కడ సెక్రటరీకోర్సు చదువుతున్నాను. డబ్బులేదు. మా నాన్నగారు నా విషయం పూర్తిగా వదులుకున్నారు. నాకిప్పుడు పరీక్షలు దగ్గరకొచ్చాయి—నాకు డబ్బు లేదు—అధమం మూడు వందలైనా కావాలి. ఆ సొమ్ము మీరు ఎలాగైనాసరే నాకు పంపినట్లయితే, మాట దక్కుతుంది. లేదా! ఇంక మీకూ నాకూ, ఇంతటితో సరి. మీరు నా ఉత్తరానికి వెంటనే సరి అయిన సమాధానం యిస్తారని ఆశిస్తున్నాను.

'మురళీకృష్ణ"-అల్లుడు వ్రాసిన ఉత్తరం సాంతంగా చదువుకొన్న పద్మనాభంగారిక్కి తనచుట్టూ అంధకారం తప్ప మరేం కనబడలేదు. ఆయన హృదయంలో ఆరని చిచ్చు రగులుకొంది. ఇప్పట్లో తన కర్తవ్యం ఏమిటో బోధపడలేదు. చూసిచూసి, తనెంతో దూరదృష్టిగల తెలివిఅయినవాణ్ణీ, తను ఎరిగున్న, కళ్ళతో చూసిన కావలసిన సంబంధాలన్నీ వదులుకుని ఎక్కడో ముక్కూ మొఖం ఎరుగని దూరపుసంబంధం చేసికున్నందుకు ఫలితం ?

తను ఉత్తరం చదువుకోడం చించి పారెయ్యడం ప్రక్క గదిలోంచి పద్మ చూస్తూనే వుంటుంది. పద్మ ముఖం తను ధైర్యంగా చూడలేడు. స్నేహితురాళ్లంతా ఏం మీ ఆయన రాలేదని అడుగుతారు. ఇప్పటికే అంతా ఏమే మీ ఆయనకి ఏం ఉద్యోగమే? ఇంకా నిన్ను తీసికెళ్లడా? అని అడుగుతూంటే ఏమని చెప్పడానికీ నోరురాక సిగ్గుపడుతోంది. ఇలాంటి పరిస్థితిలో, చదువుకొన్నవాడూ, సంస్కారీ అనుకొన్న అల్లుడు ఇలా రాస్తాడనీ, అతనింత సంకుచితదృష్టిగల అల్పమనస్తత్వంగలవాడనీ, ఇలా ప్రవర్తిస్తాడనీ, ఆయన ఊహించలేదు. ఆయనకి మార్గాంతరం ఏమీ కన్పించలేదు. ఆయన లాగే బుర్ర రెండుచేతుల్తోనూ పట్టుకొని ఆలోచిస్తున్నాడు. ఇదిగో నాన్నా కాఫీ! అంటూ, పద్మ పిలిచిన పిలుపుకి ఆయన తలెత్తిచూశాడు.ఆయన కళ్ల వెంబడి చెక్కిలమీదుగా దిగజారి గడ్డకట్టిన కన్నీటి రేఖలు చూసి పద్మ నిర్ఘాంతపోయింది. 'కాఫీ యీ అమ్మా! ఇలా ఇయ్యి' అంటూ ఆయన మందంగా కూతురుచేతిలోని గ్లాసు అందుకున్నాడు. ★



"మీ తలపాగా అడ్డం వస్తోంది దయవుంచి దాన్ని తీసేస్తారా?" [తలపాగా తీసిన తర్వాత]